

మార్చి 17 నుంచి పోలిపల్లి పైడితల్లి జాతర

రాజాం రూరల్: ఉత్తరాంధ్ర జిల్లాల భక్తుల కొంగు బంగారంగా పేరొందిన రాజాం పోలిపల్లి పైడితల్లి అమ్మవారి 98వ జాతర మహోత్సవాలు మార్చి 17 నుంచి 19 వరకూ జరగనున్నాయి. వంశపారంపర్య ధర్మకర్తలు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించే నేత్రోత్సవ కార్యక్రమాన్ని మార్చి 15న నిర్వహిస్తారు. మార్చి 19న రాత్రి ఘటోత్సవంతో జాతర పూర్తికానుంది. జాతర మహోత్సవాలు దేవదాయ శాఖతో పాటు ఎస్‌వీఆర్ కళాపరిషత్ అధ్యక్షుడు సలాది తులసి మాస్టార్ సహకారంతో నిర్వహిస్తూ వస్తున్నారు. జాతర తేదీలను ఆలయ ఈవో బలివాడ మాధవరావు సోమవారం రాత్రి ధ్రువీకరించారు.

రోడ్డెక్కిన పెన్షనర్లు

- సమస్యలు పరిష్కరించాలని ఆందోళన
- కలెక్టరేట్ వద్ద నిరసన
- ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు


కలెక్టరేట్ వద్ద పెన్షన్‌దారుల నిరసన శిబిరం

కలెక్టరేట్, జనవరి 29: విశ్రాంతి తీసుకోవాల్సిన సమయంలో తమను ఆందోళన బాట పట్టించడం దారుణమని పెన్షనర్లు ఆవేదన వ్యక్తంచేశారు. జిల్లా పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట సోమవారం నిరసన తెలిపారు. ప్రభుత్వం తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సమస్యలను పరిష్కరించాలని, లేని పక్షంలో కుటుంబ సభ్యులతో ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఈ సందర్భంగా పెన్షనర్ల సంఘం నాయకులు పెద్దింటి అప్పారావు మాట్లాడుతూ గతంలో ఎప్పుడూ పింఛన్ డబ్బుల కోసం ఇబ్బంది పడలేదని, ఈ ప్రభుత్వ హయంలో పింఛన్ కోసం రోజుల కొద్దీ ఎదురుచూడాల్సి వస్తోందని వాపోయారు. ప్రతి నెలా మొదటి తేదీన జీతాలు ఇవ్వడం లేదన్నారు. ఈ నాలుగున్నర సంవత్సరం కాలంలో తమకు రావాల్సిన బకాయిలు ఇవ్వలేదని విమర్శించారు. డీఏ బకాయిలు వెంటనే చెల్లించాలని, 11వ పీఆర్‌సి ఎరియర్స్ ఇవ్వాలని, హెల్త్ కార్డుల ద్వారా అన్ని గుర్తింపు పొందిన ఆసుపత్రుల్లో వైద్యం అందించాలని కోరారు. మెడికల్ రీయింబర్స్ మెంట్ రూ.2 లక్షల నుంచి రూ.5లక్షలకు పెంచాలని కోరారు.


నినాదాలు చేస్తున్న పెన్షన్‌దారులు

వైసీపీ నేతలు, అధికారుల ఒత్తిడే కారణమా?

- పీఆర్ కార్యాలయంలో ఏఈ ఆత్మహత్య
- పురుగు మందు తాగి.. ఉరి వేసుకుని ఘటన
- ఆ ఇద్దరు అధికారులే కారణం: భార్య ఉమ
- అధికారపార్టీ నేతల ప్రమేయంపైనా ఆరోపణలు
- డీఈ జయప్రకాశ్‌పై ఏఈ కుటుంబ సభ్యుల దాడి


డీఈ కార్యాలయాన్ని ముట్టడించిన గ్రామస్థులు, బంధువులు

రామకృష్ణ (ఫైల్)

రాజాం రూరల్, జనవరి 29: 'అధికారపార్టీ నాయకులు, అధికారుల ఒత్తిడి తట్టుకోలేకపోతున్నాను.. నేను చనిపోతాను'.. అంటూ భార్య, సన్నిహితులతో రెండ్రోజులుగా చెబుతున్న ఆ అధికారి అన్నంతపనీ చేశాడు. పురుగు మందు తాగి ఆపై ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. హృదయ విదారకరమైన ఈ ఘటన రాజాంలోని పంచాయతీరాజ్ సబ్-డివిజినల్ కార్యాలయంలో సోమవారం ఉదయం చోటుచేసుకుంది. కుమార్తెను కళాశాలలో దింపి వస్తానని ఇంట్లో చెప్పి సోమ వారం ఉదయం బయలుదేరిన రేగిడి మండల పంచాయతీరాజ్ ఏఈ వల్లూరి రామకృష్ణ (48) పది గంటల సమయంలో కార్యాలయంలో ఫ్యాన్‌కు వేలాడుతూ సహచర ఉద్యోగులకు కనిపించాడు. నిర్ఘాంతపోయిన ఉద్యోగులు రాజాం పోలీసులకు సమాచారం అందించారు. రాజాం రూరల్ సీఐ ఎస్.శ్రీనివాస్ సంఘటన స్థలాన్ని, పరిసరా లను పరిశీలించారు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

వల్లూరి రామకృష్ణది రేగిడి మండలం సోమరాజుపేట. ఆ మండల పంచాయతీ రాజ్ ఏఈగా బాధ్యతలు చూస్తూ రాజాంలోని పంచాయతీరాజ్ సబ్-డివిజినల్ కార్యాలయంలో పనిచేస్తున్నారు. ఈయనకు భార్య ఉమ, ఇద్దరు కుమార్తెలు మౌనిక, హర్షిత ఉన్నారు. అధికారుల ఒత్తిడితో విలవిల్లాడుతున్న రామకృష్ణ రెండ్రోజులుగా ఇంటికే పరిమితం అయ్యారు. అధికారుల ఒత్తిడి తట్టుకోలేక చనిపోతానని భార్య, స్నేహితులతో రెండ్రోజుల నుంచి చెబుతుండడంతో భార్య ఉమ భర్తను ఇంటినుంచి బయటకు వెళ్లనీయకుండా వెన్నంటే ఉంటున్నారు. అయితే సోమవారం ఉదయం కుమార్తె మౌనికను కళాశాల వద్ద దింపి వస్తానని వెళ్లి తిరిగి రాలేదు. భర్త ఎంతకూ ఇంటికి చేరకపోవడంతో ఆమె ఫోన్ చేసింది. అప్పటికే ఆయన ఆత్మహత్య చేసుకోవడంతో కార్యాలయ సిబ్బంది మాట్లాడి ఆమెకు సమాచారం ఇచ్చారు.

- రామకృష్ణ ఆత్మహత్య చేసుకునే ముందు పురుగు మందు తాగినట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సమీపంలో వాంతులు చేసుకున్న ఆనవాళ్లను గుర్తించారు. బాటిల్‌ను స్వాధీనం చేసుకున్నారు.

డీఈ కార్యాలయం వద్ద ఉద్రిక్తత

పంచాయతీరాజ్‌శాఖ రాజాం సబ్ డివిజినల్ అధికారి కార్యాలయం వద్ద సోమవారం సుమారు ఏడు గంటల పాటు ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఉదయం పది గంటలకే కార్యాలయ ప్రాంతానికి చేరకున్న రామకృష్ణ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, గ్రామస్థులు సాయంత్రం అయిదు గంటల వరకూ ఆందోళనకు దిగారు. కార్యాలయానికి వచ్చిన డీఈ జయప్రకాశ్‌పై దాడి చేసి గదిలో బంధించారు. అతని షర్టు చించేసి చేతులతో కొట్టారు. ఐదు గంటల సమయంలో రాజాం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఐదున్నర గంటల సమయంలో రామకృష్ణ మృతదేహాన్ని సామాజిక ఆసుపత్రికి తీసుకెళ్లారు.

- పంచాయతీరాజ్‌శాఖలోని ఉన్నతాధికారుల వేధింపులు భరించలేక సైట్ ఇంజినీర్‌గా విధులు నిర్వహిస్తున్న తన భర్త వల్లూరు రామకృష్ణ (48) ఆత్మహత్య చేసుకున్నారని భార్య వల్లూరు ఉమాదేవి రాజాం పోలీసులకు సోమవారం రాత్రి ఫిర్యాదు చేశారు. ఎస్ఐ రవికిరణ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అధికారులు, సర్పంచులే కారణం: భార్య ఉమ

నా భర్త రామకృష్ణ ఆత్మహత్య చేసుకునేంత పిరికివాడు కాదు. పంచాయతీరాజ్ ఈఈ శ్రీనివాసరావు, డీఈ జయప్రకాశ్ ఒత్తిడే ఆయన మృతికి కారణం. రెండు నెలలుగా జీతం కూడా ఇవ్వలేదు. డీఈ ఫోన్లో తిట్టేవారు. ఆయన నుంచి ఫోన్ రాగానే నా భర్త తీవ్ర ఒత్తిడికి లోనయ్యేవారు. ఆ ఇద్దరు అధికారులతో నేను మాట్లాడి మా కష్టాలు చెప్పుకున్నాను. పిల్లలతో ఉన్నాం సహకరించండని కోరినా పట్టించుకోలేదు. అంతేకాకుండా మండలంలోని చాలామంది సర్పంచిలు సిమెంట్ తినేశారు. తిరిగి నా భర్తపై ఫిర్యాదులు చేశారు. మా గ్రామ సర్పంచి రమేష్ కూడా విశ్వాసం లేకుండా నా భర్తపై ఫిర్యాదు చేశారు.


విలపిస్తున్న భార్య ఉమ

పట్టనట్టు వ్యవహరించిన నాయకులు, అధికారులు

అధికార పార్టీకి చెందిన కొంతమంది నాయకుల ఒత్తిడి కూడా రామకృష్ణ ఆత్మహ్యతకు కారణంగా తెలుస్తోంది. రేగిడి మండలంలో జరిగిన సిమెంట్ అవకతవకల నేపథ్యంలో కొంతమంది నాయకులు చెప్పిన పంచాయతీల పరిధిలోని సచివాలయాల భవనాలకు, సిమెంట్ రోడ్లకు, రైతు భరోసా కేంద్రాల నిర్మాణాలకు ఏఈ రామకృష్ణ సిమెంటు సరఫరా చేసినట్లు అభియోగాలు ఉన్నాయి. వాటికి సంబంధించి విషయం బహిర్గతం కావడంతో లెక్కలు సరితేల్చాల్సిన అధికారులు కిమ్మనకపోవడం, మౌఖిక ఆదేశాలిచ్చిన కొంతమంది నాయకులు తమకేమీ పట్టనట్లు వ్యవహరించినట్లు తెలుస్తోంది. సిమెంట్ బస్తాల లెక్క తేల్చలేక, అధికారుల ఒత్తిడి భరించలేక, నాయకులు సహకరించక, ఎటూ పాలుపోని ఏఈ రామకృష్ణ లక్షలాది రూపాయలు తనపై భారం పడుతుందన్న భయంతో ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు చర్చించుకుంటున్నారు.

వ్యసనాలకు బానిసై..

- వృద్ధురాలిని హత్య చేసిన బీటెక్ విద్యార్థి
- నగల కోసం అద్దె ఇంటి యజమానిని చంపేసిన వైనం
- అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన పోలీసులు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ వెంకటేశ్వరరావు

భోగాపురం, జనవరి 29: వ్యసనాలకు బానిసైన ఆ విద్యార్థి పూర్తిగా దారితప్పాడు. అద్దె ఇంట్లో ఉంటూ మద్యం తాగుతూ అసాంఘిక కార్యకలాపాలు చేస్తున్నాడు. ప్రశ్నించిన ఇంటి యజమానిపై కోపం పెంచుకున్నాడు. చివరకు ఆభరణాల కోసం ఆ వృద్ధురాలిని హతమార్చాడు. ఈనెల 24న జరిగిన ఈ ఘటనలో భోగాపురం మండలం మహరాజపేటకు చెందిన ముద్దాడ అప్పయ్యమ్మ(76)హత్యకు గురయ్యారు. ఈ కేసులో విజయనగరం మండలం గుంకలాంకు చెందిన ఎజ్జివరపు కూర్మారావు అలియాస్ అర్జున్(21)ను అదుపులోకి తీసుకొని రిమాండుకు తరలించినట్లు సీఐ బీవీ వెంకటేశ్వరరావు సోమవారం తెలిపారు. వారు వెల్లడించిన వివరాల మేరకు..

మహరాజపేట గ్రామంలో ముద్దాడ అప్పయ్యమ్మకు మూడు గృహాలు ఉన్నాయి. ఓ ఇంట్లో బీటెక్ విద్యార్థి అర్జున్ అద్దెకు ఉంటూ సమీప కళాశాలలో చదువుతున్నాడు. మద్యం సేవించేవాడు. పదేపదే అమ్మాయిలను తీసుకొస్తుండడంతో అప్పయ్యమ్మ మందలించేది. ఈనెల 24న సాయంత్రం ఆమె అర్జున్ గది పరిశీలనకు వెళ్లింది. ఆమె మెడలో ఉన్న బంగారాన్ని గమనించిన అర్జున్ దురాశ పుట్టి అప్పటికప్పుడే హత్యకు పథకం వేశాడు. వెంటనే ఆమె నోరు మూసేసి ఊపిరి ఆడకుండా చేశాడు. ఆమె మృతిచెందాక ఆభరణాలు తీసి మృతదేహాన్ని దుప్పట్లో చుట్టి వృద్ధురాలు నివాసముంటున్న ఇంట్లోని మరుగుదొడ్డి లోపలి వరకు లాక్కెళ్లాడు. కాలు జారి పడిపోయి చనిపోయినట్లు చిత్రీకరిం చాడు. 25న ఉదయం అప్పయ్యమ్మ బాత్‌రూంలో విగతజీవిగా పడి ఉండడం గుర్తించిన స్థానికులు ఆమె మనవరాలు జ్యోతికి సమాచారం ఇచ్చారు. కొద్దిసేపటికి అప్పయ్యమ్మ కుమార్తె నల్లా గంగమ్మ కూడా చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనుమానాస్పద మృతిగా ఎస్ఐ పి.సూర్యకుమారి కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం రిపోర్టులో అప్పయ్యమ్మను చేతులతో ఊపిరి ఆడకుండా చేసినట్లు ఉంది. ఆ దిశగా కేసు విచారణ ప్రారంభించిన పోలీసులు ఆమె ఇంట్లో అద్దెకుంటున్న వారిని ఆరా తీశారు. అర్జున్‌తోనూ మాట్లాడాక హత్యగా నిర్ధారణకు వచ్చారు. ఈనెల 28న గొట్లాం గ్రామ సమీపంలో అర్జున్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి మూడు బంగారుగాజులు, పుస్తెలుతాడు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని రిమాండ్‌కు తరలిస్తున్నట్లు సీఐ వెంకటేశ్వరరావు తెలిపారు.

బైక్‌పై కన్నేశాడంటే అంతే!

- 12 మోటారు సైకిళ్లు చోరీ
- నిందితునిపై నిఘా పెట్టి పట్టుకున్న పోలీసులు


స్వాధీనం చేసుకున్న బైక్‌లతో డీఎస్పీ

విజయనగరం క్రైం, జనవరి 29: పార్కింగ్‌లో ఉన్న బైక్‌లను కొద్దిసేపు జాగ్రత్తగా గమనిస్తాడు.. ఎవరూ రాకుంటే చాకచక్యంగా తాళం తెరిచి పట్టుకుపోతాడు. ఈ విధంగా 12 బైక్‌లను తీసుకుపోయి చోర కళలో ఆరితేరిపోయాడు. పోలీసులు నిఘా పెట్టడంతో అడ్డంగా దొరికిపోయాడు. అంతర్ జిల్లాల మోటారు సైకిళ్ల దొంగను విజయనగరం వన్‌టౌన్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. డీఎస్పీ గోవిందరావు ఆ వివరాలను తెలియజేశారు.

శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలం తిరుపతిపాలెం గ్రామానికి చెందిన దుప్పాడ దుర్గాప్రసాద్ విజయనగరం జిల్లా కేంద్రంలోని వన్‌టౌన్, టూటౌన్ పోలీసుస్టేషన్‌తో పాటు పూసపాటిరేగ, భోగాపురం పోలీసుస్టేషన్ల పరిధిలో మోటారు సైకిళ్లు చోరీ చేశాడు. బాధితుల ఫిర్యాదు మేరకు అన్నిచోట్లా కేసులు నమోదయ్యాయి. ఎస్పీ ఆదేశాలతో బైక్ చోరీ కేసులపై పోలీసులు పూర్తి నిఘా పెట్టారు. వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు, సిబ్బంది పాత నేరస్థులపై ఆరా తీయడంతో పాటు జిల్లా కేంద్రంలో తనిఖీలు ముమ్మరం చేశారు. సోమవారం ఉదయం ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా దుర్గాప్రసాద్ అనుమానాస్పదంగా తిరుగుతున్నాడు. పోలీసులు గమనించి అదుపులోకి తీసుకుని వన్‌టౌన్ స్టేషన్‌కు తరలించారు. తమదైన శైలిలో విచారణ చేపట్టగా నేరాన్ని అంగీకరించాడు. అతని వద్ద నుంచి 12 మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. శ్రీకాకుళం జిల్లాతో పాటు విశాఖపట్టణం సిటీ పరిధిలో కూడా దొంగతనాలకు పాల్పడినట్లు డీఎస్పీ గోవిందరావు తెలిపారు. విలేకరుల సమావేశంలో ట్రైనీ ఎస్పీ, సీఐ వెంకటరావు, ఎస్ఐ తారకేశ్వరరావు పాల్గొన్నారు.

ఖాళీగా ఉంటే కబ్జానే!

- ఆక్రమణలకు గురవుతున్న ప్రభుత్వ స్థలాలు
- నేతల అండతో తెగబడుతున్న వైనం


జాతీయ రహదారి పక్కనే చెరువును ఆక్రమిస్తున్న దృశ్యం

గజపతినగరం, జనవరి 29: ఖాళీ ప్రభుత్వ స్థలాలతో పాటు చెరువులు కబ్జాకు గురవుతున్నాయి. ఎన్నికలు సమీపిస్తుండడంతో ఈలోపే ఆక్రమించేద్దామనే ఆలోచనతో కొందరు వ్యక్తులు వక్రమార్గాన్ని అనుసరిస్తున్నారు. నేతల సహకారంతో నాయకులు భూములపై పడుతున్నారు. గజపతినగరంలో కొద్దిరోజులుగా ఈ తరహా భూ వ్యవహారాలు పెరిగాయి. జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న పురిటిపెంట, గజపతినగరం గ్రామ పంచాయతీల్లో సెంటు స్థలం లక్షల రూపాయలు పలుకుతోంది. నాయకులు వారి అనుచరులతో ఆక్రమణలకు పాల్పడుతున్నారు. అనేక చోట్ల స్థానికులు గుర్తించి ప్రశ్నిస్తున్నారు. అయినా వారి ఆగడాలు మీరుతూనే ఉన్నాయి. సంబంధిత అధికారులు చూసీచూడనట్టు పోతున్నారు. తాజాగా స్థానిక సబ్ స్టేషన్ కార్యాలయం పక్కనే ఉన్న బైపాస్ రోడ్డుకు ఆనుకొని సర్వేనెంబర్ 161లో చెరువు స్థలాన్ని సోమవారం పలువురు ఆక్రమించారు. పేదలమని, చిరు వ్యాపారం చేసుకుంటామని నమ్మబలికారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన ఆ వ్యక్తులు ఇక్కడ పూరిపాకలు వేయడానికి ప్రయత్నించారు. స్థానికులు ప్రశ్నించినా ఫలితం లేకపోయింది. చెరువు ఆధారంగా సుమారు 79 ఎకరాలకు సాగునీరు అందుతోంది. కబ్జాకు గురయితే భవిష్యత్ పంటలు పోయే పరిస్థితి తలెత్తుతుందని ఆయకట్టుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


చర్యలు చేపడతాం

చెరువు కబ్జా అయితే సంబంధిత ఆక్రమణదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. మదుపాడ రెవెన్యూ పరిధి కావడంతో ఆగ్రామ రెవెన్యూ అధికారితో క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టి చర్యలు తీసుకుంటాం.

- ఎం.అరుణకుమారి, తహసీల్దార్

రామతీర్థం సందర్శించిన జొన్నవిత్తుల

నెల్లిమర్ల, జనవరి 29: ప్రముఖ సినీ గేయ రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు దంపతులు ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం రామస్వామి దేవస్థానాన్ని సోమవారం సందర్శించారు. సీతారాములను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుల నుంచి ఆశీర్వాదం అందుకున్నారు. ఆలయ ప్రాశస్త్యాన్ని అడిగి తెలుసుకున్నారు. సీతారాముల దర్శనం అనంతరం శ్రీరాముడిపై జొన్నవిత్తుల ఓ పాట పాడారు.


సీతారాములను దర్శించుకుంటున్న జొన్నవిత్తుల దంపతులు

నేడు పోలమాంబ మారువారం జాతర

మక్కువ, జనవరి29 : శంబర పోలమాంబ అమ్మవారి మారు వారం జాతర మంగళవారం జరుగనుంది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దేవదాయశాఖ అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు. అమ్మవారి ప్రసాదంగా 30వేల లడ్డూలను తయారు చేయించారు. జాతరలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 150 మంది పోలీసులతో పార్వతీపురం ఏఎస్పీ సునీల్ సోరెన్ పర్యవేక్షిస్తారని ఎస్ఐ నరసింహమూర్తి తెలిపారు.

ఎస్ఐలకు స్థాన చలనం

విజయనగరం క్రైమ్, జనవరి 29: జిల్లాలో పలువురు ఎస్ఐలకు స్థానం చలనం కల్పిస్తూ ఎస్పీ దీపిక సోమవారం ఉత్తర్వులు విడుదల చేశారు. ఎన్నికల కమిషన్ నియమావళిని అనుసరించి ఈ బదిలీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. బదిలీ అయిన ఎస్ఐలు తక్షణమే తమకు కేటాయించిన పోలీస్ స్టేషన్ల పరిధిలో విధుల్లో చేరాలని ఆదేశించారు.

పేరు	ప్రస్తుతం	బదిలీ స్థానం
ఎ.సన్యాశినాయుడు	విజయనగరం(వీఆర్)	పూసపాటిరేగ
బి.గణేష్	ఆంధ్ర	డీసీఆర్‌బీ విజయనగరం
బి.దేవి	కొత్తవలస	ఆంధ్ర పీఎస్
ఎస్.సుదర్శన్	డీసీఎస్‌విజయనగరం	కొత్తవలస పీఎస్
ఐ.దుర్గాప్రసాద్	టూ టౌన్	సీసీఎస్ విజయనగరం
జె.తారకేశ్వరరావు	ఎస్.కోట	వీఆర్- వన్‌టౌన్
డి.తాతారావు	విశాఖ సీటీ	భోగాపురం
డి.రాము	విశాఖ సీటీ	కొత్తవలస
ఎ.మోహనరావు	విశాఖ సీటీ	ఎస్.కోట

శంబంగికి సహకరించం

- స్పష్టం చేసిన వైసీపీ నాయకులు
- చిన్నశ్రీను వద్ద బొబ్బిలి పంచాయితీ?


చిన్నశ్రీను కార్యాలయం వద్ద అసమ్మతి నేతలు

విజయనగరం (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడికి వచ్చే ఎన్నికల్లో టిక్కెట్ ఇస్తే తామంతా సహకరించబోమని బొబ్బిలి నియోజకవర్గానికి చెందిన కొంతమంది వైసీపీ నేతలు, కార్యకర్తలు వైసీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు వద్ద తెగేసి చెప్పినట్లు సమాచారం. సోమవారం రాత్రి జడ్పీ కార్యాలయ ఆవరణలోని చిన్నశ్రీను చాంబర్‌లో సుమారు గంటపాటు అసమ్మతి నేతలతో చర్చలు జరిగాయి. టిక్కెట్ ఎవరికి ఇచ్చినా పరవాలేదు కాని తమను పట్టించుకోని శంబంగికి మాత్రం ఇవ్వవద్దని కోరినట్లు తెలిసింది. దీంతో చిన్నశ్రీను వారిని బుజ్జగించి, కలసికట్టుగా పనిచెయ్యాలని, నియోజకవర్గంలో సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామని అన్నట్లు విశ్వసనీయ సమాచారం. సోమవారం రాత్రి చిన్నశ్రీనుని కలిసిన వారిలో కోటిపల్లి శ్రీను (ఎంపీటీసీ), ఆవు సత్యన్నారాయణ, రామ్‌సుధీర్, సావు కృష్ణ (పట్టణ పార్టీ అధ్యక్షుడు), సావు శ్రీహరి, మునకాల హరితో పాటు మరికొంతమంది అసంతృప్తి నేతలు ఉన్నారు.

బెదిరింపులకు పాల్పడితే కఠిన చర్యలు: ఎస్పీ


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ దీపిక

విజయనగరం క్రైం, జనవరి 29: జిల్లాలో బెదిరింపులు, దాడులకు పాల్పడేవారిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని ఎస్పీ దీపిక పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించి, 44 ఫిర్యాదులు స్వీకరించారు. ● బొబ్బిలి పట్టణానికి చెందిన మహిళ ఎస్పీ దీపికకు ఫిర్యాదు చేస్తూ, తన బంధువులతో ఆస్తి తగాదాలు న్యాయస్థానంలో నడుస్తున్నాయని, రాజీకి రాకపోతే చంపుతామని బెదిరిస్తూ భౌతికదాడులకు పాల్పడుతున్నారని, న్యాయం చేయాలని కోరారు. ● గరివిడి మండలం కోనూరుకు చెందిన మహిళ తన పోషణ విషయాన్ని కుమారుడు పట్టించుకోవడం లేదని, ఆస్తులు పంచాలని వేధింపులకు గురిచేస్తున్నారని ఫిర్యాదు చేశారు. ● మెరకముడిదాం మండలం భైరిపురం గ్రామానికి చెందిన వ్యక్తి తన బంధువులు తన టేకు తోటను ఆక్రమించుకునేందుకు తప్పుడు డాక్యుమెంటు సృష్టించి దౌర్జన్యానికి పాల్పడుతున్నారని, న్యాయం చేయాలని కోరారు. వివిధ సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించిన ఎస్పీ తక్షణమే పరిష్కరించి తీసుకున్న చర్యలను నివేదించాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఆస్మాపరహీన్, డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, సీఐలు మురళి, నర్సింహమూర్తి, ఎస్ఐలు సిద్ధార్థ్, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయం కోసం జనసేన దీక్ష


నిరాహార దీక్ష చేస్తున్న జనసేన నేత పాలూరు బాబు

బొబ్బిలి: బొబ్బిలి జెండా వీధి జంక్షన్‌లోని ప్రభుత్వ గ్రంథాలయాన్ని తక్షణం పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక ఎన్టీఆర్ కూడలిలో జనసేన రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి పాలూరు బాబు నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులకు లైబ్రరీ అవసరం చాలా ఉంటుందన్నారు. బొబ్బిలి లైబ్రరీని పూర్తిగా గాలికొదిలేశారని ఆరోపించారు. పాలూరు బాబుకు మద్దతుగా టీడీపీ నియోకవర్గ ఇన్‌చార్జి బేబీనాయన దీక్షా శిబిరంలో కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సమస్య తన దృష్టికి వచ్చిన వెంటనే ఎమ్మెల్సీ చిరంజీవిరావు సూచన మేరకు స్టడీ మెటీరియల్‌ను అందజేశానన్నారు. విలువైన స్థలంలో ఉన్నందున దీనిపై ఏవైనా కుంభకోణాలకు పన్నాగాలు పన్నుతున్నారేమోనని అనుమానం వ్యక్తం చేశారు. ప్రభుత్వం చేయలేకపోతే సొంత నిధులతో బాగు చేయిస్తానని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు రాంబార్కి శరత్‌బాబు, రాష్ట్ర బీసీ విభాగం నేత రౌతు రామ్మూర్తి, నారాయణరావు, జనసేన నేతలు లంక రమేష్, సంచాన గంగాధర్, రేవెళ్ల కిరణ్‌కుమార్, సతీష్, రాజా, జిల్లా లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు ఆకుల దామోదరరావు పాల్గొన్నారు.

బెల్టు షాపుల నిరోధానికి చర్యలు

రామభద్రపురం: మద్యం బెల్టు షాపుల నిరోధానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఎస్ఐ జ్ఞానప్రసాద్ తెలిపారు. ఇప్పటికే గ్రామాల వారీగా మద్యం బెల్టు షాపుల వివరాలు సేకరిస్తున్నామని చెప్పారు. గ్రామాల్లో నాటుసారా, మద్యం బెల్టుషాపుల వివరాలపై ప్రజలు సమాచారం అందించాలని సూచించారు.

రైల్వే ట్రాక్‌పై యువకుని మృతదేహం

విజయనగరం క్రైమ్: స్థానిక సంతకాల వంతెన సమీపంలోని రైల్వే ట్రాక్‌పై నగరానికి చెందిన ఇజ్జిరోతు రమేష్(26) అనే యువకుని మృతదేహాన్ని గుర్తించామని జీఆర్‌పీ ఎస్ఐ రవివర్మ సోమవారం తెలిపారు. రమేష్ లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ తల్లితో పాటు స్థానిక అలకనంద కాలనీలో నివాసం ఉంటున్నాడు. తల్లి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవివర్మ తెలిపారు. ఈ మృతిపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

కలప అక్రమ రవాణా అడ్డగింత



స్వాధీనం చేసుకున్న కలప

బొబ్బిలి: మండలంలోని రంగరాయపురం గ్రామ సమీపంలో సోమవారం రాత్రి కలప అక్రమ రవాణాను అడ్డుకున్నట్లు ఫారెస్టు గార్డు స్వప్న తెలిపారు. రెండు ట్రాక్టర్లపై తరలిస్తున్న కలపను పట్టుకుని సీజ్ చేసినట్లు చెప్పారు. రామభద్రపురం మండలం గొల్లలపేట నుంచి నారాయణరావు అనే వ్యాపారి టేకు, పాచి కలపను అక్రమంగా రవాణా చేస్తుండగా సమాచారం తెలుసుకొని నిఘా పెట్టి పట్టుకున్నట్లు చెప్పారు. వ్యాపారికి రూ.50 వేల అపరాధ రుసుం విధించినట్లు తెలిపారు.

గ్రామ జల సంఘాలకు అవగాహన

బొబ్బిలి: స్థానిక మండల పరిషత్ కార్యాలయం భవనంలో సోమవారం గ్రామ జల సంఘ సభ్యులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జలజీవన్ మిషన్ కమ్యూనిటీ కాంట్రాక్టు పద్ధతిపై సభ్యులకు శిక్షణ ఇచ్చారు. ఎంపీడీవో రవికుమార్, డీఈఈ రెడ్డి, ఏఈ శ్రావణ్‌కుమార్, ఈవోపీఆర్డీ అల్లు భాస్కరరావు పాల్గొన్నారు.

ఒప్పంద జీవోలను విడుదల చేయాలి



మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

రాజాం రూరల్: సమ్మె సందర్భంగా యూనియన్‌తో జరిగిన చర్చల్లో అంగీకరించిన ఒప్పందాలపై జీవోలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామ్మూర్తి నాయుడు మాట్లాడుతూ.. సమ్మె విరమించి 15 రోజులు గడుస్తున్నా ప్రభుత్వం జీవోల విడుదలలో జాప్యం చేస్తోందని ఆరోపించారు.

హిందీతో ఎన్నో ప్రయోజనాలు

రాజాం రూరల్: హిందీని అభ్యసించడం ద్వారా విద్యార్థులకు ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని ఎంఈవో ప్రవీణ్‌కుమార్ తెలిపారు. పెనుబాక ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో హిందీ పరీక్షలలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఆయన ప్రమాణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో హిందీ ప్రచారక్ కొండవలస మధుసూదనరావు, హెచ్‌ఎం ఆనెం మహేష్ తదితరులు పాల్గొన్నారు.

బిల్లులు ఎప్పుడిస్తారు?

- భూముల రీసర్వే అస్తవ్యస్తం
- అధికారుల తీరుపై సభ్యుల ధ్వజం
- వాడీవేడిగా జరిగిన రామభద్రపురం మండల సమావేశం

రామభద్రపురం, జనవరి 29: వివిధ గ్రామ పంచాయతీలలో సచివాలయాలు, ఆర్బీకేలు, వెలినెస్ సెంటర్ల నిర్మాణం పూర్తయి.. ఆరు నెలలు కావస్తున్నా ఇంతరకు బిల్లులు చెల్లించకపోవడంపై సభ్యులు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. మండల సర్వసభ్య సమావేశం సోమవారం ఎంపీపీ చొక్కావు లక్ష్మణరావు ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా టీడీపీ ఎంపీటీసీ సభ్యుడు మడక తిరుపతినాయుడు మాట్లాడుతూ బూసాయవలసలో రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్‌ల ప్రారంభోత్సవాలు జరిగినా ఇంతవరకు ఎందుకు బిల్లులు చెల్లించలేదన్నారు. త్వరలోనే ఎన్నికల కోడ్ వస్తుందని, అప్పుడు బిల్లులు రాకపోతే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. రొంపల్లి, రావివలస గ్రామ పంచాయతీల్లో భవన నిర్మాణాలు చేశామని, వాటికి కూడా బిల్లులు చెల్లించలేదని రొంపల్లి ఎంపీటీసీ సభ్యుడు భవిరెడ్డి శంకరరావు తెలిపారు. నిధులు లేనపుడు భవనాలు ఎందుకు మంజూరు చేశారని అధికారులను ప్రశ్నించారు. భూముల రీసర్వే తప్పులు, తడకలుగా చేశారని ఆరోపించారు. తక్కువ భూమి ఉన్న రైతు లకు ఎక్కువ చూపెట్టడం, ఎక్కువ ఉన్న రైతులకు తక్కువ చూపించారని తెలిపా రు. మండల కేంద్రంలోని ఇళ్ల పట్టాలు అనర్హులకు ఇవ్వడంపై ఎంపీటీసీ భవిరెడ్డి చంద్ర అధికారులను నిలదీశారు. ఇళ్లు ఉన్నవారికే మళ్లీ పట్టాలు ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు.



అధికారులపై ధ్వజమెత్తుతున్న మామిడివలస ఎంపీటీసీ సభ్యుడు తిరుపతినాయుడు

ఈ సమావేశంలో జెడ్పీటీసీ సభ్యులు అప్పికొండ సరస్వతి, తహసీల్దార్ ఆకుల సులోచనారాణి, ఎంపీడీవో రమామణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జగన్‌రెడ్డి పిచ్చి పరాకాష్టకు చేరింది

- టీడీపీ ఎస్.కోట నియోజకవర్గ ఇన్‌చార్జి లలితకుమారి

లక్కవరపుకోట: రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డికి పిచ్చి ముదిరి పరాకాష్టకు చేరుకుందని ఎస్.కోట నియోజకవర్గ ఇన్‌చార్జి కోళ్ల లలితకుమారి అన్నారు. సోమవారం సాయత్రం ఆమె విలేకరులతో మాట్లాడుతూ జగన్‌కి పిచ్చి చివరి దశలో ఉందన్నారు. ఈ దశలో ఉన్నవారు ఎలా ప్రవర్తిస్తారో వైద్య బృందాలకు కూడా తెలియదన్నారు. సీఎం సభలో ప్రతిపక్ష నేతల బొమ్మలు ఏర్పాటు చేసి వాటిని కార్యకర్తలతో కొట్టించడం, తన్నించడం వంటి పనులు చేయిస్తూ పైశాచిక ఆనందం పొందడాన్ని ఏమంటారో వైసీపీ నేతలకే తెలియాలన్నారు. రాష్ట్ర ప్రజలు మరో 13 రోజులు ఓపిక పట్టాలన్నారు. ఎన్నికల నోటిఫికేషన్‌తో జగన్ పీడ ఈ రాష్ట్రానికి వదులుతుందన్నారు.

కోళ్ల కుటుంబానికి పరామర్శ

ఎస్.కోట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కోళ్ల లలిత కుమారి కుటుంబ సభ్యులను పరామర్శించడానికి టీడీపీ-జనసేన నేతలు తరలివచ్చారు. సోమవారం ఉదయం గజపతినగరం జనసేన ఇన్‌చార్జి పడాల అరుణ, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు కిమిడి కళా వెంకటరావు, నాయకులు పతివాడ నారాయణస్వామి... కోళ్ల దంపతులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో సువ్వాడ రవిశేఖర్, కంది చంద్రశేఖర్, పతివాడ తమ్మినాయుడు, ఈశ్వరరావు, జి.ఎస్.నాయుడు, రమణమూర్తి, రామకృష్ణ, కె.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.


కోండ్రు సమక్షంలో టీడీపీలో చేరుతున్న దృశ్యం

వలస కుటుంబాలు టీడీపీలో చేరిక

రేగిడి: బుడితిపేటకు చెందిన 40 కుటుంబాల వారు గతంలో విశాఖపట్నానికి వలస వెళ్లారు. వీరంతా సోమవారం విశాఖపట్నం టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి కోండ్రు మురళీమోహనరావు సమక్షంలో పార్టీ తీర్థం స్వీకరించినట్లు మండల తెలుగు యువత అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు విలేకరులకు తెలిపారు. రాజాం నియోజకవర్గంలో టీడీపీ గెలుపునకు కృషి చేస్తామని కొప్పిశెట్టి శిమ్మారావు, పలిశెట్టి అప్పన్న తెలిపారు. పార్టీలో చేరిన వారిలో కొప్పిశెట్టి భాస్కరరావు, రావూరి రాంబాయి, కొప్పిశెట్టి ఏసుబాబు, కొప్పిశెట్టి హరి, త్రిపురాన జనార్దనరావు తదితర 40 కుటుంబాల వారు ఉన్నారు. కార్యక్ర మంలో విశాఖ జిల్లా టీడీపీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, దక్షిణ నియోజకవర్గ పార్టీ సమన్వయ కార్యకర్త గండి బాబ్జి, రేగిడి మండల నేత గురవాన ధనంజయ్, చిన్నశిర్లాం బూత్ ఇన్‌చార్జ్‌లు మజ్జి దాలినాయుడు, బంగారునాయుడు పాల్గొన్నారు.

నకిలీ ధ్రువపత్రంతో పింఛన్

- 'జగనన్నకు చెబుదాం'లో ఫిర్యాదు
- 192 వినతులు స్వీకరించిన అధికారులు


వినతులు స్వీకరిస్తున్న అధికారులు

కలెక్టరేట్, జనవరి 29: నకిలీ విద్యార్హతల ధ్రువపత్రంతో పింఛను పొందిన వారిపై చర్యలు తీసుకోవాలని గంట్యాడ మండలం కొర్లాం గ్రామానికి చెందిన కరక సత్యనారాయణ జగనన్నకు చెబుదాంలో విన్నవించుకున్నారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వివిధ సమస్యలపై 192 వినతులు వచ్చాయి. డీఆర్‌వో అనిత, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్లు సుదర్శనదొర, సుమబాల తదితరులు వినతులు స్వీకరించారు. కొర్లాం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి జామి మండలం బాపు ట్యుటోరియల్‌లో 1970-71 నుంచి 1971-72లో ఐదు నుంచి ఆరో తరగతి చదివినట్లు తప్పుడు స్టడీ సర్టిఫికెట్ తీసుకున్నారని అదే గ్రామానికి చెందిన కరక సత్యనారాయణ ఫిర్యాదులో పేర్కొన్నారు. వాస్తవంగా ఆ వ్యక్తి గంట్యాడ జెడ్పీ పాఠశాలలో 1980 జూన్ 17న ఆరో తరగతిలో చేరినట్లు ప్రధానోపాధ్యాయురాలు స్టడీ సర్టిఫికెట్ ఇచ్చారని ఫిర్యాదులో పేర్కొన్నారు. నకిలీ సర్టిఫికెట్‌తో ఆధార్‌లో వయస్సు మార్పు చేసుకుని పింఛను పొందారని వివరించారు. ఇప్పటికే రెండుసార్లు మండల పరిషత్ అధికారులకు ఆధారాలతో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని తెలిపారు. వెంటనే దీనిపై విచారణ చేయాలని కోరారు. కాగా, రెవెన్యూ శాఖకు సంబంధించి 120, గ్రామ వార్డు సచివాలయ శాఖకు 13, పంచాయితీరాజ్ విభాగానికి 15, డీఆర్‌డీఏ 22, వైద్య ఆరోగ్య శాఖ 6, హౌసింగ్‌కు 5 వినతులు వచ్చాయి. సంబంధిత అధికారులతో డీఆర్‌ఓ మాట్లాడుతూ పోలింగ్ పర్సనల్ మేనేజ్‌మెంట్ సిస్టంలో డేటాను అప్‌లోడ్ చేయాలని సూచించారు.

టోల్‌గేట్ ఎందుకో?

'విజయనగరం నుంచి విశాఖపట్టణం వెళ్లే రహదారిలో జొన్నాడ గ్రామ సమీపంలో బోడమెట్టపాలెం వద్ద టోల్ గేట్ ఏర్పాటు పనులు జరుగుతున్నాయి. ఇది ఆరు వరుసల రహదారి కాదు. నిత్యం విజయనగరం నుంచి తగరపువలస, విశాఖపట్టణానికి వెళ్లే ప్రయాణికులు మాత్రమే అధికంగా ఉంటారు. విశాఖపట్టణంలో ఆసుపత్రులకు అధిక సంఖ్యలో రోగులు వెళ్తారు. టోల్‌గేట్ వల్ల ఆర్థిక భారం కూడా పడుతుంది. ఎందుకు ఈ టోల్ గేట్ నిర్మిస్తున్నారో తెలియడం లేదు. వెంటనే విరమించుకోవాలి' అని విజయనగరం నియోజకవర్గం టీడీపీ నాయకులు ఐవీపీరాజు, ప్రసాద్, కనకల మురళీమోహన్ జగనన్నకు చెబుదాంలో విన్నవించుకున్నారు.

స్థలాన్ని ఆక్రమించి షెడ్డు వేసుకున్నారు

విజయనగరం పట్టణం 11వ వార్డులోని రాజీవ్‌నగర్ కాలనీలో తమ ఖాళీ స్థలాన్ని ఒక కార్పొరేటర్ దౌర్జన్యంగా ఆక్రమించుకున్నారని జె.పార్వతి జగనన్నకు చెబుదాంలో విన్నవించుకున్నారు. ఆ స్థలంలో షెడ్డును నిర్మించుకున్నారని వివరించారు. దీనిపై ప్రశ్నిస్తే అనేక విధాలుగా బెదిరిస్తున్నారని, వెంటనే విచారణ చేసి న్యాయం చేయాలని కోరారు.

ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన అవసరం

శృంగవరపుకోట: ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని విశాఖపట్నం సీఐడీ డీఎస్పీ కుమారస్వామి అన్నారు. సోమవారం శృంగవరపుకోట మండల ప్రజా పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ యాక్ట్ 1989 వరం లాంటిదన్నారు. ఎస్సీ, ఎస్టీ దాడుల సమయంలో కేసులు పెడుతున్నప్పుడు బెదిరింపులకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని దళిత నాయకులు కడారి జయశంకర్, గణేష్‌లు కోరారు. ఎంపీపీ సండి సోమేశ్వరరావు, తహసీల్దార్ డి.శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ ఇంటి అప్పారావు, నాయకులు కేత వీరన్న, పి.జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

రక్షిత మంచినీటి పథకాలు మంజూరు

వేపాడ: వీలుపర్తి పంచాయతీలోని నాలుగు శివారు గ్రామాలకు నాలుగు రక్షిత మంచినీటి పథకాలు మంజూరయ్యాయి. ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు, జడ్పీటీసీ ఎస్.అప్పలనాయుడులు సోమవారం వీటికి భూమి పూజలు చేశారు. రాయుడుపేట, బొర్రవలసకు రూ.15.40 లక్షల వంతున, కొలికిపాలెం గ్రామానికి రూ.36.30 లక్షలు, చినదుంగాడ కు రూ.39.60 లక్షలు మంజూరైనట్లు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ పైడిరాజు తెలిపారు. సర్పంచ్ శానాపతి లీల, అప్పారావు, ఎంపీడీఓ పట్నాయిక్, మాజీ సర్పంచ్ గోకాడ సత్యంనాయుడు, ఏఈ దేవి తదితరులు పాల్గొన్నారు.

జోగేంద్రనాథ్ మండల్‌కు నివాళి

బొబ్బిలి: స్థానిక సంగవీధిలో సోమవారం అంబేడ్కర్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సోర సాంబయ్య ఆధ్వర్యంలో మహాప్రాణ్ జోగేంద్రనాథ్ మండల్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే శంబంగి వెంకటచినఅప్పలనాయుడు.. మండల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. న్యాయవాదులు మజ్జి జగన్నాథం, ఎస్‌జే విల్సన్‌బాబా, అప్పారావు పాల్గొన్నారు.

బీమా చెక్కుల పంపిణీ

బొబ్బిలి: స్థానిక గొల్లపల్లి పదో వార్డులో సోమవారం వైఎస్సార్ బీమా మొత్తాన్ని లబ్ధిదారులకు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన బొంగు పద్మ, బొత్స సింహాచలం, పిట్టల ఇందిర, బండి నాగమణి, కె.లక్ష్మిలకు మున్సిపల్ చైర్మన్ వెంకటమురళీకృష్ణారావు బీమా పరిహారాన్ని అందజేశారు. కౌన్సిలర్ గోవిందమ్మ పాల్గొన్నారు.

ఫిర్యాదు చేసినా సవరణలు లేవు


ఓటర్ల జాబితాలో తప్పులు చూపుతున్న నేతలు

లక్కవరపుకోట, జనవరి 29: ఓటర జాబితాల్లో అవకతవకలపై ఫిర్యాదు చేసినా అధికారులు స్పందించడం లేదని సోమవారం పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. రంగారాయపురం పంచాయతీలో తప్పులు, తడకలపై మాజీ జెడ్పీటీసీ కరెడ్ల ఈశ్వరరావు మండిపడ్డారు. దీనిపై స్థానిక తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం లేదన్నారు. ఒక బూతులో ఓట్లు మరో బూతులోకి వెళ్లిపోయాయని... డబుల్ ఎంట్రీలు ఉన్నాయని, డెత్‌లు తొలగించలేదని ఆధారాలతో సహా సమర్పించినా స్పందన లేదని ఆరోపించారు. కోరుకొండ కొండమ్మ, కరెడ్ల రమణమ్మ చనిపోయినా ఓట్లు తొలగించలేదన్నారు. పిల్లా సునీల్‌కుమార్, గోర్సా వరలక్ష్మిల పేర్లు రెండుచోట్ల ఉన్నా సరిచేయలేదన్నారు. ఇలా అన్ని మండలాలు, గ్రామాల్లో తప్పుల తడకలతో ఓటర్ల జాబితాలు వచ్చాయని తెలిపారు. మంగళవారం నియోజ కవర్గ ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేస్తామన్నారు.

ప్రాథమిక హక్కులను కాపాడాలి

కలెక్టరేట్: రాజ్యాంగంలో ఆర్టికల్ 12 నుంచి 35 వరకూ ఉన్న ప్రాథమిక హక్కులను కాపాడల్సిన బాధ్యత అందరిపై ఉందని ఏపీ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ వైస్ చైర్మన్, డైరెక్టర్ జవాబ్ మహమ్మద్ నాసిర్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట క్రిస్టియన్, ముస్లిం, మైనార్టీ, ఎస్సీ, ఎస్టీల ఐక్య కలయిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాథమిక హక్కులతో పాటు మతస్వేచ్ఛ, సమానత్వపు హక్కు అన్ని వర్గాల వారికి వరిస్తుందని చెప్పారు. కానీ, ప్రస్తుతం దేశంలో మైనార్టీలు, ఎస్సీ, ఎస్టీ ప్రజలకు భద్రత కరువైందని ఆరోపించారు. మైనార్టీల రక్షణ చట్టం అమలు కోసం ఉద్యమించాలని కోరారు.

'ఆడుదాం ఆంధ్రా'లో మరో వివాదం

- షటిల్ టోర్నమెంట్ విజేతపై అభ్యంతరం
- క్రీడాకారుడు అవుట్ సోర్సింగ్ ఉద్యోగి అని ఫిర్యాదు
- ఫలితం తేల్చని నిర్వాహకులు


షటిల్ బ్యాడ్మింటన్ ఆడుతున్న క్రీడాకారులు (ఫైల్)

బొబ్బిలి, జనవరి 29: బొబ్బిలి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో మరో వివాదం నెలకొంది. షటిల్ టోర్నమెంట్ ఫైనల్స్‌లో విజేతగా నిలిచిన జట్టులో ఒక క్రీడాకారుడు అవుట్ సోర్సింగ్ ఉద్యోగి అని ఫిర్యాదు అందింది. దీంతో ఫలితాన్ని తేల్చలేక నిర్వాహకులు చేతులెత్తేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక మల్లమ్మపేట-బాడంగి జట్ల మధ్య షటిల్ టోర్నమెంట్ ఫైనల్స్ జరిగాయి. ఇందులో మల్లమ్మపేట జట్టు విజేతగా నిలిచింది. ఆ జట్టులో రమేష్, గౌరీశ్ ఆడారు. రమేష్ బీసీ వెల్ఫేర్ కార్యాలయంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగి కావడంతో అతడిని అనర్హుడిని చేయాలని ప్రత్యర్థి జట్టు అధికారులకు మొదట్లోనే ఫిర్యాదు చేశాయి. దీనిపై వారు ఎటువంటి నిర్ణయం తీసుకోలేకపోవడంతో ఫైనల్స్ దాకా తీసుకొచ్చారు. తీరా ఫైనల్స్‌లో ఆరోపణలు ఎదుర్కొంటున్న జట్టు విజేతగా నిలిచింది. దీంతో పెనువివాదం చోటుచేసుకుంది. ఫలితాన్ని ప్రకటిస్తే అంగీకరించేది లేదని, నిబంధనల ప్రకారం ప్రభుత్వ ఉద్యోగులు ఆడరాదని బాడంగికి చెందిన సాయి జట్టు వాదించింది. ఆ జట్టుకు మరికొంతమంది క్రీడాకారులు మద్దతుగా నిలిచారు. ఈలోగా అధికార పార్టీ నాయకుల జోక్యం చోటుచేసుకుంది. ఈ ఫలితాన్ని ప్రకటించలేక అధికారులు, నిర్వాహకులు చేతులెత్తేశారు. దీనిపై నిర్ణయాన్ని జిల్లా క్రీడా అధికారి నిర్ణయానికి విడిచిపెట్టారు. షటిల్ టోర్నమెంట్ విజేతలను ప్రకటించకుండానే మిగిలిన జట్లలో విజేతలకు ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు బహుమతులను పంపిణీ చేశారు.

తలనొప్పిగా మారింది

ఆడుదాం ఆంధ్రా క్రీడల నిర్వహణ మాకు బాగా తలనొప్పిగా మారింది. విధి విధానాలను స్పష్టంగా వివరించడంలో సరైన మార్గదర్శకత్వం కరువైంది. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు క్రీడల్లో పాల్గొనవచ్చని కొంతమంది, కూడదని మరికొంతమంది చెప్పారు. దీనితో ఫైనల్స్ వరకు గందరగోళం నెలకొంది. వివాదం పెరిగింది. ఓడిపోయిన జట్ల వారు మమ్మల్ని తీవ్రంగా దూషించడం, వాదనకు దిగడం ఆవేదనకు గురిచేసింది. క్రీడాకారులకు మద్దతుగా బయటి వారి జోక్యం ఎక్కువ కావడం బాధాకరం.

-నల్ల వెంకటనాయుడు, పీడీ, గ్రౌండ్ ఇన్‌చార్జి, బొబ్బిలి

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విజయనగరం రింగురోడ్డు: కలెక్టరేట్ సబ్ స్టేషన్‌లో విభాగాల నిర్వహణ నిమిత్తం మంగళవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ పి.హరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పావనీ నగర్, అరుంధతీ నగర్, రెల్లివీధి, గణేష్ ఆలయం రోడ్డు, షాలిమార్ వెనుక వీధి, మర్రిచెన్నారెడ్డి కాలనీ, సిక్కుల కాలనీ, రామయ్యమ్మ కాలనీ, బీసీ కాలనీ, యాతపేట, ద్వారపూడి, రాజుల కాలనీ, రెవెన్యూ కాలనీ, బ్యాంకు కాలనీ, సాయికీర్తినగర్, కామాక్షి నగర్, సాయిలలితనగర్, కేఎల్‌పురం ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని తెలిపారు. శృంగవరపుకోట: స్థానిక పుణ్యగిరి ఫీడర్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ సహాయ ఇంజనీర్ రుద్ర రవికుమార్ తెలిపారు. పందరప్పన్న కూడలి, రైల్వే స్టేషన్ రోడ్డు, శ్రీనివాసకాలనీ, బర్మాకాలనీ, ఎంపీడీవో కార్యాలయం, అఫీషియల్ కాలనీ, టీచర్స్ కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

జాబ్ మేళా రేపు

కలెక్టరేట్: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం సీతమ్ ఇంజనీరింగ్ కళాశాలలో రీజినల్ జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. ఈ మేరకు సోమవారం తన చాంబర్‌లో జాబ్ మేళా కరపత్రాన్ని ఆవిష్కరించారు.

'విజయవాడలో ధర్నాకు హాజరవుతాం'

లక్కవరపుకోట: ఆశా వర్కర్ల డిమాండ్ల సాధన కోసం వచ్చే నెల 8న విజయవాడలో నిర్వహించనున్న ధర్నాకు హాజరవుతున్నట్టు సంఘ నాయకురాలు జి.దేవి తెలిపారు. సోమవారం కల్లేపల్లిలో పీహెచ్‌సీ వైద్యులు అజయ్‌కు వినతిపత్రం అందజేశారు. పీహెచ్‌సీ పరిధిలో గల ఆశా వర్కర్లంతా విజయవాడ బయలుదేరాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆశాలు వరలక్ష్మి, సరస్వతి పాల్గొన్నారు.

20 మద్యం సీసాలతో వ్యక్తి అరెస్టు

రేగిడి: రెడ్డిపేటలోని ఒక పాన్‌షాపు నిర్వాహకుడి నుంచి 20 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ శ్రీనివాస్ సోమవారం విలేకరులకు తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసినట్లు చెప్పారు.

జల జీవన్ మిషన్ పనులపై శిక్షణ

కలెక్టరేట్: జల జీవన్ మిషన్ పనులపై సోమవారం మండల స్థాయి అధికారులు, గ్రామ జల సంఘాల సభ్యులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం ఆన్‌లైన్‌లో నిర్వహించారు. గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజనీర్ ఉమాశంకర్, జడ్పీ సీఈవో రాజకుమార్ పాల్గొని మాట్లాడారు. గ్రామ జల సంఘాల ఆధ్వర్యంలో సీసీఎస్ ద్వారా జలజీవన్ పనులు చేసేందుకు పలు మార్గదర్శకాలు, సూచనలు చేశారు.

పరీక్షలపై అవగాహన

లక్కవరపుకోట: జమ్మాదేవిపేట వద్దగల ఎంజేపీ బాలికల రెసిడెన్సియల్ పాఠశాలలో సోమవారం విద్యార్థులకు పరీక్షలపై అవగాహన కల్పించారు. పరీక్షాపే చర్చలో భాగంగా పీఎం మోదీ పరీక్షలను విద్యార్థులు ఎలా ఎదుర్కోవాలో అన్న అంశంపై అవగాహన కల్పించినట్లు ప్రిన్సిపాల్ యామీకే పాత్రో తెలిపారు.

'రామతీర్థం' సేవలు అభినందనీయం

విజయనగరం దాసన్నపేట: రామతీర్థం సేవా సంఘం సేవలు అభినందనీయమని ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ కొనియాడారు. నగరంలోని సంఘ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యఅతిథిగా మాట్లాడారు. రామతీర్థంలో భక్తులకు మెరుగైన వసతి కల్పించాలన్నారు. సంఘ అధ్యక్షుడు గోవిందరావు, ప్రతినిధులు సముద్రపు రామారావు, బాలాజీ, ఆల్తి శ్రీనివాసరావు, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూలో పరిచయ వేదిక

విజయనగరం రూరల్: స్థానిక జేఎన్‌టీయూలో సోమవారం ఆంధ్రప్రదేశ్ డెవలప్‌మెంట్ డైలాగ్ పేరుతో విద్యార్థుల పరిచయ కార్యక్రమం జరిగింది. వీసీ కె.వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ.. ఉత్తమ ప్లేస్‌మెంట్ కోసం స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సును 2020 నుంచి ప్రారంభించామన్నారు. మైక్రో సాఫ్ట్ సంస్థతో ఎంఓయూ కుదుర్చుకున్నామని చెప్పారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ, డాక్టర్ నాగరాజు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రశంసాపత్రాలు

విజయనగరం దాసన్నపేట: స్థానిక చలపతి పాఠశాలలో ఆరో అఖిలభారత బాలల చిత్రలేఖన పోటీలు ప్రతాప్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెయింటింగ్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ పోటీల్లో 155 మంది విద్యార్థులు పాల్గొన్నారు. 65 మంది విద్యార్థులకు బంగారు పతకాలతో పాటు ప్రశంసాపత్రాలు అందించారు.

ఆర్థికంగా బలోపేతం కావాలి

రాజాం: మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి తలే రాజేష్ అన్నారు. స్థానిక మల్లికార్జున కాలనీలో మెప్మా సౌజన్యంతో ఏర్పాటు చేసిన ప్రగతి యూనిట్ పేపరు ప్లేట్ల తయారీ సంస్థను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసుకొని ప్రగతి సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, కమిషనర్ ఎంపీ నాగరాజు, టీఎంసీ రత్నం, వెంకటరావు పాల్గొన్నారు.

దీక్షను విజయవంతం చేయండి

రాజాం: పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలనే డిమాండ్‌తో విశాఖపట్నం జిల్లా కేంద్రంలో ఫిబ్రవరి 4న సాగర సంగ్రామ దీక్ష చేపట్టనున్నామని జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీరాములు పిలుపునిచ్చారు. సోమవారం ఎంఈఓ కార్యాలయం వద్ద జిల్లా ఏపిసిపిఎస్‌ఈఏ స్టిక్కర్లను, పాకెట్ కేలండర్‌ను ఆవిష్కరించారు. ప్రభుత్వం కళ్లు తెరచి... ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించకపోతే తీవ్రస్థాయిలో ఆందోళనలు చేపడతామని శ్రీరాములు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, కుమరాపు చంద్రినాయుడు, వాసు సబ్జాన్, అజారుద్దీన్, రామకృష్ణ, కూర్మారావు, బాబూరావు. సీతారామలింగేశ్వరుడు తదితరులు పాల్గొన్నారు

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

విజయనగరం క్రైం: వాహన డ్రైవర్లు ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపించాలని, ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలని రవాణా శాఖ ఉప కమిషనర్ రవీంద్రనాథ్ అన్నారు. రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా సోమవారం రవాణా శాఖ కార్యాలయంలో డ్రైవర్లకు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐలు రమణ, దుర్గాప్రసాద్, రవిశంకర్, ఏఎంవీఐలు ఐశ్వర్యలక్ష్మి, శ్రావ్య పాల్గొన్నారు.

కరాటే విజేతలకు అభినందన

విజయనగరం దాసన్నపేట: రాష్ట్ర స్థాయి అండర్-14 కరాటే పోటీల్లో విజయనగరం జిల్లా గజపతినగరానికి చెందిన పి.మోజెస్ భువన్ కిరణ్ బంగారు పతకంతో పాటు నలుగురు బాలలు రజత పతకాలు సాధించారు. సోమవారం రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిటీ చైర్మన్ కేసలి అప్పారావు తన క్యాంపు కార్యాలయంలో వీరిని అభినందించారు. ఈ కార్యక్రమంలో కోచ్ ఆనంద్, పి.అశ్విని తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు టీడీపీలోనే సముచిత స్థానం

● పినతాడివాడ, గరివిడిలో జయహో బీసీ కార్యక్రమం

బీసీలకు టీడీపీలోనే సముచిత స్థానం ఉంటుందని ఆ పార్టీ నాయకులు తెలిపారు. సోమవారం డెంకాడ మండలంలోని పినతాడివాడ, గరివిడిలో జయహో బీసీ కార్యక్రమం నిర్వహించారు.

బీసీల సంక్షేమానికి కృషి: బంగార్రాజు

డెంకాడ: నారా చంద్రబాబు నాయుడు బీసీల సంక్షేమానికి అహర్నిశలు కృషిచేశారని నెల్లిమర్ల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు తెలిపారు. మండలంలోని పినతాడివాడలో మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖరరావు, టీడీపీ మండలాధ్యక్షుడు పల్లె భాస్కరరావు ఆధ్వర్యంలో జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహించారు.కంది చంద్రశేఖరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీలకు టీడీపీతోనే రాజ్యాధికారం లభించిందని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ బీసీలను మోసం చేశారని ఆరోపించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి పతివాడ నారాయణస్వామినాయుడు , జడ్పీటీసీ మాజీసభ్యుడు పతివాడ అప్పలనారాయణ, విజయన గరం పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పాణిరాజు, రాష్ట్ర కొప్పలవెలమ సాధికార కన్వీనర్ అల్లు విజయ్ కుమార్, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ కాగితాల సత్యనారాయణ రెడ్డి, యాదవ సాధికార సమితి కన్వీనర్ కొర్నాన ఆదిబాబు, నెల్లిమర్ల నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు చిల్లా పద్మ పాల్గొన్నారు.

ఆర్‌ఈసీఎస్ అక్రమాలపై బొత్స నోరువిప్పాలి: నాగార్జున

గరివిడి: ఆర్‌ఈసీఎస్‌లో ఎనర్జీ అసిస్టెంట్ల నియామకంలో జరిగిన అక్రమాలు, అవినీతిపై మంత్రి బొత్స సత్యనారాయణ నోరు విప్పాలని విజయనగరం జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కిమిడి నాగార్జున డిమాండ్ చేశారు. గరివిడిలో జయహో బీసీ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ ఐటీఐ నకిలీ సర్టిఫికెట్లు సమర్పించిన వారికి ఉద్యోగాలు కల్పించి భారీగా అక్రమాలకు పాల్పడ్డారని విజిలెన్స్ తనిఖీల్లో వెల్లడైందని తెలిపారు. పోస్టుల భర్తీలో నిబంధనలు పాటిం చలేదని, అర్హతలు లేని వారికి ఉద్యోగాలు ఇచ్చారని, విచారణలో తేలిందన్నారు. ఈ విషయంపై మంత్రిబొత్సమౌనం వీడాలన్నారు. ఆర్‌ఈసీఎస్‌లో అవినీతిపై మంత్రి నోరు విప్పకపోవడం పలు అనుమానాలకు తావి స్తోందన్నారు. నాలుగున్నరేళ్లుగా నియోజకవర్గాన్ని గాలికి వదిలేసిన మంత్రి బొత్స ఎన్నికల ముందు పర్యటనలతో హడావిడి చేస్తున్నారని ఆరోపించారు.కార్యక్రమంలో టీడీపీనాయకులు అల్లు విజయ్‌కుమార్, కర్రోతు నరసింగరావు, గుర్నాపే రాము,దుమ్ము అశోక్, పొగిరిపైడిరాజు, పైల బలరాం, వెన్నె సన్యాసినాయుడు, ముల్లురమణ, బలగం వెంకట్రావు, దన్నాన రామచంద్రుడు, వెంపడాపు రమణమూర్తి, మహంతి రమణమూర్తి పాల్గొన్నారు.

బీసీలపై వైసీపీ చిన్నచూపు

గుర్ల: బీసీలపై వైసీపీ చిన్నచూపు చూస్తోందని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి వి.సన్యాసినాయుడు ఆరోపించారు. సోమ వారం గుర్ల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రయోజనాలను పక్కనపెట్టి ఎంతసేపు కక్ష సాధింపు చర్యలు చేపట్టాలని ప్రభుత్వం చూస్తోందని ఆరోపించారు. కనీసం విద్యార్థులకు ఎటువంటి సౌకర్యాలు కూడా కల్పించలేని, ఉపాధి అవకాశాలు కూడా లేవని ఆరోపించారు. పార్టీ బీసీసెల్ జిల్లా కార్యదర్శి దాసరి శివప్రసాద్ మాట్లాడు తూ బీసీ యువతకుపట్టించుకోకపోతే తీవ్ర పరిణామం తప్పదన్నారు. పెద్ద మనుషులుగా చెప్పుకునే వారు కనీసం బీసీల కోసం ఏమీ చేయకుండా కాలయాపన చేశారని విమర్శించారు.



డెంకాడ: మాట్లాడుతున్న కర్రోతు బంగార్రాజు

వైఎస్ విగ్రహం తొలగింపుపై వివాదం

● వైసీపీలోని రెండు వర్గాల మధ్య పోరు



వైఎస్‌ఆర్ విగ్రహం తొలగించిన స్థలం ఇదే



వేరే చోట ఉంచిన విగ్రహం

నెల్లిమర్ల: మండలంలోని దన్నానపేటలో వైఎస్ విగ్రహం తొలగింపు వివాదాన్ని రాజేసింది. గ్రామకూడలిలోఉన్న విగ్రహాన్ని సోమవారం ఓ వైసీపీ నాయకుడు తొలగించి వేరొకచోటుకు తరలించాడు. దీన్ని జగనన్న కాలనీ వద్ద ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు తెలిసింది. అయితే అదే గ్రామానికి చెందిన వైసీపీలోనిమరోవర్గంవారు దీనిపై తీవ్ర అభ్యంతరం తెలుపుతున్నారు. తమతో చర్చించకుండా ఈ నిర్ణయం ఎలా తీసుకుంటారని ప్రశ్నిస్తున్నారు. ఈవ్యవహారం పోలీసుల వరకు వెళ్లింది.ఉదయం నుంచి వైఎస్ విగ్రహం వద్ద గ్రామ మహిళా పోలీసును, ఒక కానిస్టేబుల్‌ను బందోబస్తుగా ఉంచారు.

భూయాజమాన్య హక్కు చట్టం రద్దుచేయాలి

● గజపతినగరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సూర్యారావు



నిరాహార దీక్ష చేస్తున్న న్యాయవాదులు

గజపతినగరం: ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన భూ యాజమాన్య హక్కుచట్టాన్ని తక్షణమే రద్దుచేయాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బిట్ర సూర్యారావు కోరారు. సోమవారం గజపతినగరం కోర్టు ఆవరణలో న్యాయవాదులు నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ భూ యజమానులకు నష్టం వాటిల్లే విధంగా తీసుకువచ్చిన చట్టం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు రమేష్ రాజు, చప్పా తిరుపతి, రెడ్డి శ్రీనివాసనాయుడు,కలిశెట్టి రామునాయుడు పాల్గొన్నారు.

రహదారి ఆక్రమణపై ఫిర్యాదు



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న దృశ్యం

భోగాపురం(పూసపాటిరేగ): పూసపాటిరేగ మండలం కోనాడ రెవెన్యూ కిలుగుపేటలో కాలిబాట రహదారి ఆక్రమణకు గురైందని పి.తౌడురెడ్డి, తదితరులు సోమవారం తహసీల్దార్ భాస్కరరావుకు ఫిర్యాదుచేశారు. సర్వే నెంబరు 305లోగల 68 సెట్లు స్థలంలో తమ పొలాలకు ఇద్దరు వ్యక్తులు నీరు ప్రవహించేలా పైపులైన్లు ఏర్పాటు చేసి వాటికి రక్షణగా కంచే ఏర్పాటు చేశారని తెలిపారు. రైతులు నడిచే కాలిబాటగా ఉన్న ప్రభుత్వ భూమిని ఆక్రమించుకోవడంపై చర్యలు తీసుకోవాలని కోరారు.

కార్మికుల పోరాట స్ఫూర్తి చరిత్రాత్మకం

● ఇఫ్టూ రాష్ట్ర నాయకుడు వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

నెల్లిమర్ల: నెల్లిమర్ల కార్మికుల పోరాట స్ఫూర్తి చరిత్రాత్మకమని ఇఫ్టూ రాష్ట్ర నాయకుడు వెంకటేశ్వర్లు అన్నారు. నెల్లిమర్ల కార్మికులపై పోలీసు కాల్పులు జరిగి 30 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఇఫ్టూ ఆధ్వర్యంలో జరజాపుపేటలోని స్మారక స్థూపం వద్ద సోమవారం సాయంత్రం జెండా ఆవిష్కరించారు. అప్పటి కాల్పుల్లో అమరులైన కార్మికుల చిత్ర పటాల వద్ద ఇఫ్టూ నాయకులు, కార్మికుల కుటుంబీకులు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కార్మికుల వర్ధంతిని పురస్కరించుకుని రాష్ట్ర వ్యాప్తంగా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా ఫిబ్రవరి 4న నెల్లిమర్లలో వర్ధంతి సభను పెద్ద ఎత్తున నిర్వహిస్తునట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కాళ్ల అప్పలసూరి, నామాల తిరుపతిరావు, ఉరిటి సింహాచలం, బోని సత్యనారాయణ, సన్యాసిరావు, కార్మికులు, మహిళలు పాల్గొన్నారు.

అమర వీరుల వర్ధంతి సభకు తరలిరావాలి

నెల్లిమర్ల: ఫిబ్రవరి 4న నెల్లిమర్లలో జరగనున్న అమరవీరుల 30వ వర్ధంతి సభకు కార్మికవర్గం అధిక సంఖ్యలో తరలిరావాలని ఇఫ్టూ నాయకులు కోరారు. ఈ మేరకు వారు సోమవారం మిల్లు గేటు వద్ద, జరజాపుపేట, నెల్లిమర్లల్లో ప్రచారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఇఫ్టూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.గీత, జిల్లా ఉపాధ్యక్షుడు కాళ్ల అప్పలసూరి, నామాల తిరుపతిరావు, సింహాచలం, పీఓడబ్ల్యు రాష్ట్ర నాయకురాలు వెంకటలక్ష్మి, జిల్లా అధ్యక్షురాలు పార్వతి, ఎఐకెఎంఎస్ జిల్లా నాయకుడు వి.మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగంలో స్టార్టప్స్‌ను ప్రోత్సహించాలి

● యూరోపియన్ యూనియన్ పల్సస్ గ్రూప్ సీఈవో శ్రీనుబాబు



శ్రీనుబాబును సత్కరిస్తున్న నిర్వాహకులు

డెంకాడ: వ్యవసాయ రంగంలో స్టార్టప్స్‌ను ప్రోత్సహించడం వల్ల పల్లెలు అభివృద్ధి పథంలో ముందుకు సాగుతాయని యూరోపియన్ యూనియన్ పల్సస్ గ్రూప్ సీఈఓ గేదెల శ్రీనుబాబు తెలిపారు. లెండి కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో వనరులను ఉపయోగించి ఉత్తమ ఆంధ్రగా మారడానికి విద్యార్థులు స్టార్టప్స్ నెలకొల్పాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్నోవేషన్ ఇంక్యుబేషన్ సెల్ నిర్వాహకులు ఏవీ పరాంకుశం, సెల్ నిర్వాహకులు పి.తిరుమల, కోఆర్డినేటర్ వరప్రసాద్, వినోద్ కుమార్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ అడ్మినిస్ట్రేషన్ టి.హరిబాబు పాల్గొన్నారు.

మద్యం సీసాల స్వాధీనం

పూసపాటిరేగ: పసపాం గ్రామ సమీపంలో అక్రమంగా నిల్వ ఉంచిన 100 మద్యం సీసాలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని ఎస్‌ఈబీ ఇన్‌స్పెక్టర్ కె.సురేష్ సోమవారం తెలిపారు. ఒమ్మి బోగిరాజు నుంచి 100 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. మద్యాన్ని అమ్మిన పేరాపురం జీఆర్‌వో సేల్స్‌మేన్ పైలా సన్యాసిరావును ఎ2గా చేసి జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారికి నివేదించినట్లు చెప్పారు.

బాడంగిలో పరీక్షా పే చర్చ

బాడంగి: స్థానిక జెడ్పీ పాఠశాలలో సోమవారం ప్రధాని మోదీ నేతృత్వంలో పరీక్షా పే చర్చ కార్యక్రమం జరిగింది. విద్యార్థులతో పాటు ఉప విద్యాశాఖాధికారి పి.బ్రహ్మాజీరావు, ఎంపీటీసీ శ్రీనివాసరావు ఈ కార్యక్రమాన్ని తిలకించారు. అనంతరం ఉప విద్యాశాఖాధికారి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రధాని మోదీ చెప్పినటు విద్యార్థులు పరీక్షలు శ్రద్ధగా రాసి...ఫలితాలు సాధించాలని తెలిపారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. నాణ్యమైన భోజనం పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం దత్తి సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు పెంచబోం

● ఈ ఆర్థిక సంవత్సరం భారం మోపబోము
● ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ● 2024-25 ఆదాయ అంచనాలు రూ.21,162 కోట్లు ● ప్రతిపాదిత ధరల రాబడి రూ.100.44 కోట్లు
● ఒక్క రైల్వే ట్రాక్షన్ చార్జీలు ● యూనిట్‌కు రూ. పెంపునకు ప్రతిపాదన

విశాఖపట్నం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులపై ఈ (2024-25) ఆర్థిక సంవత్సరంలో ఎటువంటి భారం మోపడం లేదని, చార్జీలు పెంచడం లేదని ఏపీ ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ వెల్లడించారు. విశాఖపట్నం కార్పొరేట్ కార్యాలయంలో ఏపీఈఆర్‌సీ సోమవారం నిర్వహించిన టారిఫ్ ప్రతిపాదనల స్వీకరణ, ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని డిస్కమ్ ప్రగతిని, ప్రతిపాదనలు వివరించారు. కేవలం రైల్వే ట్రాక్షన్ చార్జీలను మాత్రం యూనిట్‌కు రూపాయి పెంచడానికి అనుమతి ఇవ్వాలని కోరారు. నాలుగేళ్ల నుంచి యూనిట్‌కు రూ.5.50 మాత్రమే వసూలు చేస్తున్నామని, సర్వీసు ధర 40 శాతం పెరిగిందని, ఈ నేపథ్యంలో పెంపు అనివార్యమన్నారు. దీనివల్ల డిస్కమ్‌కు అదనంగా రూ.100.24 కోట్లు సమకూరుతుందన్నారు. అలాగే ఎలక్ట్రిక్ వాహనాల చార్జింగ్ స్టేషన్లను ఓల్టేజ్ సర్వీసు వ్యయంతో టారిఫ్‌కు లింకు చేయాలని ప్రతిపాదించారు. ప్రస్తుత ధరల నుంచి రూ.17,854.16 కోట్లు ఆదాయం వస్తుందని, ప్రతిపాదిత ధరల ద్వారా రూ.100.44 కోట్లు, ప్రతిపాదిత పర్ కాస్ట్ రికవరీ నుంచి రూ.3,207.27 కోట్లు కలిపి మొత్తం రూ.21,161.86 కోట్లు వస్తుందని అంచనా వేసినట్టు వివరించారు. రాబడి లోటు ఏమీ లేదని స్పష్టంచేశారు.

కొనుగోలు ఖర్చు యూనిట్ రూ.4.69

రాబోయే ఆర్థిక సంవత్సరంలో యూనిట్‌కు విద్యుత్ కొనుగోలు ఖర్చు రూ.4.69గా ఉంటుందని, ప్రసారం, పంపిణీ నష్టాల వ్యయం 49 పైసలు, నెట్‌వర్క్ ఖర్చులు రూ.1.63, ఇతర ఖర్చులు 28 పైసలు కలిపి సర్వీసు వ్యయం యూనిట్‌కు రూ.7.09 అవుతుందని వివరించారు. సగటున యూనిట్‌కి రూ.6.01 వస్తుందని, రెండింటి మధ్య తేడా యూనిట్‌కి రూ.1.08 ఉంటుందని అంచనా వేశారు. కొత్త ఆర్థిక సంవత్సరంలో గృహ వినియోగం 7,741.84 మిలియన్ యూనిట్లు ఉంటుందని, దాని ద్వారా రూ.3,764.76 కోట్లు వస్తుందని అంచనా వేశారు. వాణిజ్యానికి 1,501.26 మి.యూ. ఇవ్వడం ద్వారా రూ.1,534.45 కోట్లు వస్తుందని, పరిశ్రమలకు 494.59 మి.యూ. ఇవ్వడం వల్ల రూ.406.87 కోట్లు వస్తుందని, వ్యవసాయం, వాటి అనుబంధ రంగాలకు 4,767.55 మి.యూ. ఇస్తే రూ.1,000.71 కోట్లు వస్తాయని, సంస్థాగతంగా 508.32 మి.యూ.కు రూ.384.32 కోట్లు రావచ్చునని మొత్తం చూసుకుంటే ఎల్‌టీ విభాగంలో 15,013.56 మి.యూ.కు రూ.7,091.11 కోట్లు వస్తాయని అంచనాలు చూపించారు. అదే హెచ్‌టీ విభాగంలో అయితే 14,840.50 మి.యూ.కు రూ.10,673.34 కోట్లు వస్తుందని వివరించారు.

కుష్ఠువ్యాధి నివారణపై అవగాహన కల్పించాలి

విజయనగరం రింగురోడ్డు: కుష్ఠు వ్యాధి నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు అన్నారు. సోమవారం తన కార్యాలయంలో వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 30 నుంచి వచ్చే నెల 13 వరకూ ఈ అవగా హన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. వివక్ష లేని సమాజం కోసం గ్రామసభల్లో ప్రస్తావించాలని సిబ్బందికి సూచించారు. పట్టణ ప్రాంతాలు, పాఠశాలల్లో సహా యక బృందం సమావేశం నిర్వహిస్తామన్నారు. శరీరంపై స్పర్శలేని మచ్చలు ఉన్నట్లయితే దగ్గరలోని ఆరోగ్య కేంద్రాల్లో వైద్యాధికారులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీకా నియంత్రణాధికారి అచ్యుతకుమారి, జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ ఎస్. సూర్యనారాయణ, డాక్టర్ రామేశ్వరీ ప్రభు, సిబ్బంది పాల్గొన్నారు.

బేబీనాయన చొరవతో బోరు

తెర్లాం: డి.గదబవలసలో ప్రార్థనా మందిరం వద్ద బొబ్బిలి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బేబీనాయన సొంత నిధులతో తాగునీటి బోరును వేయించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జావాన రమేష్‌నాయుడు, పాస్టర్ గురుమూర్తి, జీవన్ కుమార్, సంఘ సభ్యులు, వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ రామారావు, మాజీ ఎంపీటీసీ అప్పలస్వామి, టీడీపీ నాయకులు జె.కృష్ణ, కె. చిన్నంనాయుడు, రాంబాబు, జె.రామునాయుడు, స్వామి, గోవింద పాల్గొన్నారు.

రుణమాఫీ చెక్కు పంపిణీ

తెర్లాం: తెర్లాంలో సోమవారం 4వ విడత ఆసరా సంబరాల కార్యక్రమానికి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల ఆర్థిక స్వావలంబనే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమన్నారు. నియోజకవర్గంలోని 4,432 సంఘాల్లో 53,184 మంది అక్కచెల్లెమ్మలకు రూ.70 కోట్ల 85 లక్షలు విడుదల చేశామన్నారు. అనంతరం ఆయన చేతులమీదుగా రుణమాఫీ చెక్కు మహిళా సంఘాలకు అందజేశారు.

ఘనంగా తీర్థ మహోత్సవం



ఎడ్ల బండ్ల పరుగు పోటీల దృశ్యం

వేపాడ: వేపాడలో సోమవారం గ్రామ దేవతలు ముత్యాలమ్మ, పరదేశమ్మ అమ్మవార్ల తీర్థ మహోత్సవం వైభవంగా సాగింది. వేలాది మంది భక్తులు అమ్మవార్లకు పసుపు కుంకుమలు సమర్పించుకున్నారు. ఈ సందర్భంగా రంగవల్లులు, ఎడ్ల బండ్ల పరుగు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో వల్లంపూడికి చెందిన ఏడువాక సత్తిబాబు బండి ప్రథమ, వావిలపాడుకు చెందిన గండి వెంకటరావు ద్వితీయ, వీరాంజనేయులు బండి తృతీయ స్థానం దక్కించుకున్నాయి. విజేతలకు నగదు బహుమతులు అందజేశారు.

చట్టాలపై అవగాహన అవసరం

కొమరాడ: గిరిజనులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సీఐడీ డిప్యూటీ సూపరింటెండెంట్ డి.లక్ష్మణరావు తెలిపారు. సోమవారం కొమరాడ వెలుగు కార్యాలయంలో ఏర్పాటు చేసిన గిరిజన హక్కులు, సాధికారతపై ఒక్క రోజు అవగాహన సదస్సులో విశాఖ రీజినల్ సీఐడీ కార్యాలయం డీఎస్పీ లక్ష్మణరావు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో, తహసీల్దార్ పాల్గొన్నారు.

ఏజెన్సీలో పౌష్టికాహారం అందడం లేదు

● సీడీపీవోను నిలదీసిన ఎంపీటీసీ సభ్యుడు సుబ్బారావు

సాలూరు రూరల్: ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందడం లేదని కురుకూటి ఎంపీటీసీ సభ్యుడు సుబ్బారావు సాలూరు సీడీపీవో సత్యవతిని నిలదీశారు. సోమవారం సాలూరు మండల పరిషత్ సమావేశం ఎంపీపీ రాములమ్మ అధ్యక్షతన, వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తల సమ్మె వల్ల గ్రామసచివాలయ సిబ్బందికి కేంద్రాల నిర్వహణ బాధ్యతలను అప్పగించారని, వారికి బాధ్యతలు ఇవ్వడం వల్ల గర్భిణులు,బాలింతలకు ఇన్ని రకాల రేషన్ ప్రభుత్వం వస్తున్నాయా అని గిరిజనులకు తెలిసిందన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఏజెన్సీవాసులకు పౌష్టికాహారాన్ని సక్రమంగా అందించలేదని సీడీపీవో దృష్టికి తీసుకెళ్లారు. ఈవిషయంపై ఖరాసవలస ఎంపీటీసీ అప్పికొండ రమాదేవి సైతం సుబ్బారావుతో ఏకీభవించారు. తోణాం పీహెచ్‌సీ వైద్యాధికారి సుజాతవర్మలో జోక్యం చేసుకుని తమ ఆసుపత్రికి వచ్చే ఏజెన్సీలో కొందరు గర్భిణులు పౌష్టికాహారం అందడంలేదని చెప్పారని స్పష్టం చేశారు. దీంతో వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్ మాట్లాడుతూ ఈవిషయంపై సీడీపీవో తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ఉపాధి పనికి రెండు పూటలా కూలీలు వచ్చే విధంగా ప్రజాప్రతినిధులు సహకరించాలని ఏపీవో రామకృష్ణనాయుడు కోరారు. సమావేశం కేవలం గంట 15 నిమిషాల్లో ముగించారు. సమావేశంలో రెండవ వైస్ ఎంపీపీ గుణవతి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ రెడ్డి పద్మావతి,శివరాంపురం ఎంపీటీసీ కళ్లేపల్లి త్రినాథనాయుడు,ఎంపీడీవో గొల్లపల్లి పార్వతి పాల్గొన్నారు.

'వచ్చే నెలలో టిడ్కో ఇళ్ల పంపిణీ'

సాలూరు: వచ్చే నెలలో లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లను పంపిణీ చేయనున్నట్లు ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర తెలిపూఆరు. సోమవారం పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో వైఎస్సార్ ఆసరా కార్యక్రమం నిర్వహించా రు. ఈసందర్భంగా మాట్లాడుతూ వచ్చే నెలలో అర్హులైన ప్రతిఒక్కరికి చేయూత పథకం ద్వారా రూ.18.750 ఖాతాల్లో వేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ ఈశ్వరమ్మ, రెడ్డి పద్మావతి పాల్గొన్నారు.

ఎస్‌కేపాడు పార్క్ సిద్ధం చేయాలి: పీవో

గుమ్మలక్ష్మీపురం: ఎస్‌కెపాడు పార్క్‌ను సిద్ధం చేయాలని పార్వతీపురం ఐటీడీఏ పీవో సి.విష్ణుచరణ్ ఆదేశించారు. సోమవారం ఎస్‌కేపాడులో ఏర్పాటు చేస్తున్న కల్చర్ అండ్ అడ్వంచర్ పార్క్ సుందరీకరణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పనుల్లో జాప్యం చేయవద్దని కోరారు. అనంతరం కురుపాం జీసీసీ బంక్‌ను తనిఖీచేశారు. కార్య క్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ అధికారి జె.శాంతీశ్వరరావు, ఏపీవో ఏ.మురళీధర్ పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై శిక్షణ

కురుపాం రూరల్: కురుపాంలో సోమవారం ఎస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో లిబ్‌టెక్ ఇండియా సంస్థ సహకారంతో ఉపాధిహామీ పథకం అమలు, సాంకేతికపరమైన అంశాలపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా వేతనదారులు జాబ్‌కార్డ్ పొందడం, జాబ్‌కార్డ్‌కు ఆధార్ లింక్ చేయడం, వేతన వివరాలు వెబ్‌సైట్‌లో చెక్ చేయడం, జాబ్‌కార్డ్ ఏక్టివేషన్ తదితర అం శాలపై లిబ్‌టెక్ ఇండియా సంస్థ ప్రతినిధులు కిషోర్, వెంకటేష్, ఎస్ సొసైటీ డైరెక్టర్ షేక్ గౌస్ గిరిజన యువతకు అవగాహన కల్పించారు.

అక్రమ నిర్మాణాలు నిలిపివేయాలి

పాలకొండ: పట్టణంలోని నాలుగో వార్డులో అక్రమ నిర్మాణాలు నిలిపివేయాలని ఎస్సీ, ఎస్టీ జేఏసీ మన్యం జిల్లా మహిళా ప్రతినిధి నూతులపాటి జయభూషణమణి, పార్వ తీపురం మన్యం జిల్లా ఆలిండియా దళిత రైట్స్ ఫోరం అధ్యక్షుడు బత్తిన మోహన్ కోరారు. స్పందన కార్యక్రమంలో పాలకొండ ఆర్డీవో లావణ్యకు వినతిపత్రం అందజేశారు. బాధ్యులపై చర్య తీసుకోవాలని కోరారు.

అశోక్‌ను కలిసిన తమ్మినాయుడు



అశోక్‌గజపతిరాజును సన్మానిస్తున్న తమ్మినాయుడు

భోగాపురం(పూసపాటిరేగ): టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా పతివాడ తమ్మినాయుడును నియమించడంతో ఆ పార్టీ సీనియర్ నాయకుడు పూసపాటి అశోక్ గజపతిరాజును విజయనగరంలో సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో మాజీ మంత్రి పతివాడనారాయణ స్వామినాయుడు పాల్గొన్నారు.

క్రీడాకారులకు బహుమతులు పంపిణీ

గుర్ల: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గ ఆటల పోటీలో విజయం సాధించిన క్రీడాకారులకు సోమవారం బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పలాస నియోజకవర్గం వైసీపీ పార్టీ పరిశీలకులు కేవీ సూర్యనారాయణరాజు, ఎంపీడీవో కల్యాణి, ఈవోపీఆర్‌డీ గాయత్రీ, ఎంఈవో భానుప్రకాష్, పీఈటీలు పాల్గొన్నారు.

అప్పులు తీసుకోవడం కొత్త కాదు: బొత్స

చీపురుపల్లి: స్వాతంత్రం వచ్చినప్పటి నుంచి అప్పులు తీసుకోవడం ప్రభుత్వాలకు కొత్తకాదని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు. సోమవారం చీపురుపల్లిలోని కనకమహలక్ష్మి అమ్మవారి ఆలయ మైదానంలో ఏర్పాటుచేసిన నాలుగో విడత ఆసరా నిధులు పంపిణీ కార్యక్రమంలో మాట్లాడారు రుణాలుగా తెస్తున్న మొత్తాలురాష్ట్ర ప్రజల సంక్షేమానికి వెచ్చిస్తున్నామని తెలిపారు. సంక్షేమ పథకాల మంజూరులో తాముగాని, తమనాయకులు గాని లంచాలు తీసుకున్నట్లు చెబితే, తల దించుకుంటామని చెప్పారు. మండలంలోని 14,727 మంది పొదుపు మహిళలకు రూ.11.54 కోట్ల రుణ మాఫీ నిధులను మంత్రి అందజేశారు. అనంతరం పట్టణంలో విలేజ్ హెల్త్ క్లినిక్, ఆర్బీకేలను మంత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎంపీపీ ఇప్పిలి వెంకట నరసమ్మ, వలిరెడ్డి శిరీష, డీఆర్‌డీఏ పీడీ కల్యాణచక్రవర్తి, ఆర్డీవో బి. శాంతి, తహశీల్దార్ ఎం. సురేష్, ఎంపీడీఓ జి. గిరిబాల పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి సూరినాయుడు

గరివిడి: గెడ్డపువలస సర్పంచ్ తమ్మగంటి సూరినాయుడు జనసేనకు రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు సోమవారం విలేఖరుల సమావేశంలో తెలిపారు. వైఎస్ షర్మిల నాయకత్వంలో పని చేయడానికి ఇష్టపడి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అద్దాల రామచంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

లైంగిక వేధింపులకు పాల్పడవద్దు

గరివిడి: పని ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. గరివిడి మండల పరిషత్ అభివృద్ధి అధికారి వారి కార్యాలయంలో సోమవారం దీనిపై సమావేశం నిర్వహించారు. అన్ని విభాగాలలో అంతర్గత కమిటీలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జీవో-117 వర్తింపజేయవద్దు

సీతంపేట: ఐటీడీఏ పరిధిలో గిరిజన ప్రాంతాలకు జీవో-117 వర్తింప జేయవద్దని ఏపీ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ మన్యం జిల్లా ప్రధాన కార్యదర్శి మురళీమోహన్‌రావు, జిల్లా కార్యదర్శి కృష్ణారావు డిమాండ్‌చేశారు. సోమవారం సీతంపేటలోని ఐటీడీఏ కార్యాలయం ఆవరణలో గిరిజన ఉపాధ్యాయులు, సవర భాషా వలం టీర్లు, విద్యార్థులు ఆరుగంటలపాటు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీజీ హెచ్ఎంలు ఎస్ఏ క్రేడర్ ప్రమో షన్లు వెంటనే ఇవ్వాలని, జీవో -3ను పునరుదద్ధరించాలని, సవరభాషా వలంటీర్లను జూన్‌నుంచి నియమించి ఏప్రిల్ వరకు కొనసాగించాలని కోరారు. అనంతరం సమస్యల తో కూడిన వినతిపత్రాన్ని జిల్లా గిరిజన సంక్షేమశాఖ డీడీ అన్నదొరకు అందజే శారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు తిరుపతిరావు, రమేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాజు, మండంగి లక్ష్మణరావుపాల్గొన్నారు.

ఫెడరేషన్ కప్ పోటీలకు బొడ్డవలస విద్యార్థులు

సాలూరు రూరల్: ఫెడరేషన్ కప్ జాతీయ పోటీలకు సీనియర్ విభాగంలో బొడ్డవలస బీఆర్‌అంబేడ్కర్ గురుకులానికి ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ వంగపండు శ్రీరాములు తెలిపారు. జాతీయస్థాయిలో పోటీలకు అర్హతకు వివిధ రాష్ట్రాలకు చెందిన ఎనిమిదిజట్లకు కేరళలోని కోజికోడ్‌లో ఇటీవల పోటీలను నిర్వహించారని చెప్పారు. ఈమేరకు ఆ జట్టులో తమ పాఠశాలకు చెందిన వాసు,భవానీప్రసాద్,జశ్వంత్ ఎంపికయ్యారని చెప్పారు. విద్యార్థులు, పీడీ,పీఈటీలను గురుకులాల కోఆర్డినేటర్ పద్మజ,ప్రిన్సిపాల్ శ్రీరాములు,తిరుపతిరావు అభినందించారు.